నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 15 సెప్టెంబర్ 2024 | HYDERABAD

## ఆక్రమణల నిగ్గుతేల్చేలా..బఫర్‌జోన్లకు హద్దులు..

మేడ్చల్, సెప్టెంబర్14(నమస్తే తెలంగాణ): చెరువుల సమీపంలో బఫర్ల జోన్ల వద్ద హద్దుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా 489 చెరువులు ఉన్నాయి. చెరువుల సమీపంలో రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు సంయుక్తంగా త్వరలోనే సర్వేలు నిర్వహించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. చెరువుల సమీపంలో బఫర్ జోన్లకు హద్దులు ఉన్నప్పటికీ తిరిగి రీ సర్వే చేసి నూతనంగా హద్దులు ఏర్పాటు చేసేలా చూస్తున్నారు. జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లోని చెరువుల సమీపంలోని బఫర్ జోన్లలో ఆక్రమణలకు గురై ఇండ్లను నిర్మిస్తున్నట్లు వస్తున్న ఆరోపణల నేపథ్యంలో సర్వేలు చేసి బఫర్ జోన్ల హద్దులను గుర్తించినట్లయితే అక్రమ నిర్మాణాలు సంఖ్య తేలిపోతుందని అధికారులు చెబుతున్నారు.

చార్మినార్ వద్ద నిమజ్జన మార్గాన్ని పరిశీలిస్తున్న డీజీపీ జితేందర్, నగర సీపీ సీవీ ఆనంద్, బల్దియా కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు

# నిమజ్జన ఘట్టానికి పటిష్ట భద్రత

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
- శోభాయాత్ర మార్గాలను పరిశీలించిన డీజీపీ
- 17న హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో సెలవు

పనిదినంగా నవంబర్‌లో రెండో శనివారం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 14 ( నమస్తే తెలంగాణ )/బడంగ్‌పేట: నగరంలో 17న జరిగే గణేశ్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ తెలిపారు. బాలాపూర్ విఘ్నేశ్వరుడిని శనివారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, నగర సీపీ సీవీ ఆనంద్, హైదరాబాద్, రంగారెడ్డి కలెక్టర్లు అనుదీప్ దురిశెట్టి, శశాంక్, రాచకొండ సీపీ సుధీర్‌బాబులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. అనంతరం నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా బాలాపూర్ నుంచి చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, లాల్‌దర్వాజ, చార్మినార్, ఎంజే మార్కెట్, బషీర్‌బాగ్, ట్యాంక్ బండ్ వరకు రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో 25వేల మంది పోలీసులు విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. శోభాయాత్ర సాగే మార్గాల్లో ఏర్పాట్లు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీలను కంట్రోల్ రూం ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాల్లో గట్టి నిఘా ఉంచామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి మాట్లాడుతూ.. నిమజ్జన యాత్ర కొనసాగే ప్రతీ మార్గంలో పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగుతాయన్నారు. ఇందుకోసం 15 వేల సిబ్బంది విధుల్లో ఉంటారని చెప్పారు. గతేడాది కంటే ఈసారి 15 శాతం విగ్రహాలు అధికంగా వచ్చే అవకాశం ఉన్నదన్నారు. ఇందుకు అనుగుణంగానే ఏర్పాట్లు, అదనంగా క్రేన్లు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో 15వేల మంది సిటీ పోలీసులు, 10వేల మంది జిల్లాల నుంచి పోలీసులను రప్పిస్తున్నట్లు నగర సీపీ సీవీ ఆనంద్ తెలిపారు.

### 17న సెలవు..

గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలకు ఈనెల 17న సెలవు ప్రకటిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సెలవు దినానికి బదులుగా నవంబర్ 9( రెండో శనివారం)న పనిదినంగా ప్రభుత్వం పేర్కొంది. అలాగే తెలంగాణ హైకోర్టు పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డితో పాటు మేడ్చల్-మల్కాజిగిరి, జ్యుడీషియల్ అకాడమీ, రాష్ట్ర లీగల్ సర్వీసు అథారిటీ, హైదరాబాద్ జ్యుడీషియరీ సంస్థలకు గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో 17న సెలవు దినంగా ప్రకటిస్తూ.. హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు.

**మధ్యాహ్నం 1.30లోపే.. ఖైరతాబాద్ గణేశుడి నిమజ్జనం**

- ఖైరతాబాద్ గణేశుడి నిమజ్జనాన్ని 17న మధ్యాహ్నం 1.30లోపు పూర్తి చేయనున్నట్లు నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. పోలీసులు, జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి.. ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జనం సకాలంలో పూర్తయ్యేలా చూస్తారన్నారు.

### అవసరమున్న చోట అన్నపూర్ణ కేంద్రాలు

గణేశ్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 73 పాండ్స్, 5పెద్ద చెరువుల వద్ద నిమజ్జన కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 73 పాండ్స్‌లో 27 బేబీ పాండ్స్, 24 పోర్టబుల్, 22 ఎస్కలేటర్ పాండ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవసరమున్న చోట అన్నపూర్ణ భోజన కేంద్రాలను అందుబాటులో ఉంచామన్నారు.

### 30వేల మంది బలగాలు



ట్రై కమిషనరేట్ల పరిధిలో నిమజ్జనోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సుమారు 30వేల మంది పోలీసు బలగాలను రంగంలోకి దింపింది పోలీసు శాఖ.

## ఎక్కడ చదివినా.. చెప్పేస్తుంది..!

**యూడైస్‌తో హైదరాబాద్ ప్రభుత్వ స్కూళ్ల పర్యవేక్షణ**

**విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం యాప్‌లోనే**

**వీటి ఆధారంగానే మధ్యాహ్న భోజనం, దుస్తులు తదితర పథకాల వర్తింపు**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 14 ( నమస్తే తెలంగాణ ) : విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుశాతం, పాఠశాలల పరిస్థితులు, కావాల్సిన సదుపాయాలు? ఇలా ఒక్కటేమిటీ పాఠశాలలకు సంబంధించిన పూర్తి సమాచారంపై స్పష్టత రానున్నది. అందుకోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'యూడైస్' పోర్టల్‌ను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు విద్యాశాఖాధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ పోర్టల్‌లో ప్రతీ విద్యార్థికి ఒక పర్మినెంట్ ఎడ్యుకేషన్ నంబర్ ఇస్తారు. దీంతో ఆ విద్యార్థి దేశంలో ఎక్కడ.. ఏ చదువు చదివినా తెలిసిపోతుందని అధికారులు చెబుతున్నారు. అయితే ఈ పోర్టల్‌లో ప్రతీ విద్యార్థి యూడైస్‌లో నమోదు కావాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుల వివరాలన్నీ కూడా ఒకే చోట నమోదు చేయనున్నారు. ఇప్పటికే హైదరాబాద్ విద్యాశాఖాధికారులకు యూడైస్ పోర్టల్‌పై శిక్షణ కూడా ఇస్తున్నారు.

### సుమారు 7.58 లక్షల మంది విద్యార్థులు..

హైదరాబాద్‌లో ఒకటో తరగతి నుంచి 10 వ తరగతి వరకు 773 ప్రభుత్వ, ఎయిడెడ్, 3,500 వరకు ప్రైవేట్ , కార్పొరేట్ పాఠశాలలున్నాయి. సుమారు 7.58 లక్షల మంది విద్యార్థుల వరకు చదువుకుంటున్నారు. ఇక యూడైస్‌లో పొందుపర్చిన సమాచారానికి అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, దుస్తులు తదితర పథకాల వర్తింపు ఉండనున్నది. వివిధ రకాల నిధులను కూడా యూడైస్ ఆధారంగానే కేటాయిస్తారు.

# ఫైళ్లు కదలవేమీ?




*బాసు చెప్పేదెప్పుడు..మోక్షం కలిగేదెప్పుడు..అన్నట్లు తయారైంది హెచ్ఎండీఏలో ఫైళ్ల కథ. ప్రభుత్వ పెద్దలు చెబితే తప్ప..నెలలు గడిచినా..దస్త్రాలు కదలడం లేదు. రాజు తలుచుకుంటే రాజ భోగాలకు ఢోకా ఉండదనే మాటను హెచ్ఎండీఏ అధికారులు తూచా తప్పకుండా పాటిస్తున్నారు. రాజు చెప్పడమే ఆలస్యం... ఏ కారణంతోనైనా పెండింగ్‌లో ఉన్న ఫైల్.. చెప్పిన గడువులోగా క్లియర్ కావాల్సిందే. అందుకు అధికారులే ప్రత్యేక రూట్ మ్యాప్‌తో ఫైల్స్ క్లియరెన్స్ కోసం అరాటపడుతున్నారనే చర్చ నడుస్తోంది. ఎంఎస్‌బీ, ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్, ఎన్‌వోసీ, బిల్డింగ్ పర్మిషన్ల విషయంలో తలెత్తే వివాదాల విషయంలో హెచ్ఎండీఏ వేదికగా జోరుగా పైరవీలు సాగుతున్నాయి. ముఖ్యంగా ప్లానింగ్ విభాగంలో ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులు ఈ విషయంలో మరింత వేగంగా స్పందిస్తున్నారు. రెఫరెన్స్ రావడమే తరువాయి అన్నట్లు కమిషనర్‌తో నేరుగా ఫైళ్లపై చర్చించేంత చొరవ తీసుకొని.. వ్యవహారాలను చక్కబెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.*

*- సిటీబ్యూరో, సెప్టెంబర్ 14(నమస్తే తెలంగాణ)*

### పూర్తి స్థాయి కమిషనర్ ఉన్నా...

గతంలో పూర్తి స్థాయి కమిషనర్ లేకపోవడంతో పర్మిషన్ల విషయంలో జాప్యం జరుగుతున్నదని కాంగ్రెస్ పార్టీ నేతలు విమర్శలు చేశారు. అయితే హెచ్ఎండీఏకు పూర్తి స్థాయి కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్ బాధ్యతలు తీసుకుని మూడు నెలలు గడుస్తున్నా... సంస్థ పాలనపై పట్టు సాధించలేక పోయారనే విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ పెద్దలు, లేదా పురపాలక శాఖ ఉన్నతాధికారులు చెబితే తప్ప.. ఫైల్స్ విషయంలో స్పందించడం లేదని సమాచారం. కింది స్థాయి అధికారులు కూడా తమకొచ్చిన బాధ ఎందుకని.. దరఖాస్తుదారులు వస్తే.. ఉన్నతాధికారుల పేరు చెప్పి.. తప్పించుకోవడమనేది ఆనవాయితీగా మారుతున్నది.

### మూలుగుతున్న 260కిపైగా దస్త్రాలు

హెచ్ఎండీఏలో అవినీతిరహిత పాలనపరమైన అంశాలకు పెద్ద పీట వేసేలా గతంలో టీఎస్‌బీపాస్ వంటి ఆన్‌లైన్ మాధ్యమాలను ప్రవేశపెట్టారు. దాదాపు ఆన్‌లైన్ వేదికగా పారదర్శకంగా పనులు జరిగేలా ఐటీ విభాగాన్ని బలోపేతం చేశారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఆఫీస్ పని తీరులో మార్పులు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా... ఫైల్ స్టేటస్ అప్‌డేట్ కాకుండా ఉంచడం, ఫైల్ పురోగతి, షార్ట్ ఫాల్ విషయంలో అంశాల కోసం కార్యాలయాల కోసం రావాల్సి వస్తున్నదని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఇక హెచ్ఎండీఏకు ఆదాయం సమకూర్చే ఛేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్, మల్టీ స్టోర్డ్ బిల్డింగ్, ఎన్‌వోసీతోపాటు, బిల్డింగ్ పరిష్కార విషయంలోనైతే ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తేనే.. ఫైల్ ముందుకు కదలుతున్నదనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి 260కిపైగా ఫైళ్లు ఆయన వద్దే మూలుగుతున్నాయని తెలిసింది. కమిషనర్ వద్దే పెండింగ్‌లో ఉండటంతో కింది స్థాయి అధికారులు కూడా అటు వైపు చూసే పరిస్థితి లేదని, ఏదైనా ఫైల్‌కు సంబంధించి ప్రభుత్వ పెద్దల సిఫార్సులు ఉంటే తప్ప.. పని పూర్తయ్యే పరిస్థితి లేదని పలువురు బాధితులు వాపోతున్నారు. ఇక మున్సిపల్ శాఖను కూడా సీఎం రేవంత్‌రెడ్డి చూస్తుండటంతో ఫైళ్ల విషయంలో ఆచితూచి స్పందించి, క్లియరెన్స్ ఇస్తున్నారని, ఏదైనా నోట్ ఫైల్ ఉంటే గానీ దస్త్రాలు ముందుకు కదిలే పరిస్థితి లేదని, కనీసం మధ్యాహ్నం 3 గంటల తర్వాత నిర్వహించే విజిటింగ్ అవర్‌లోనూ కమిషనర్‌ను కలిసేందుకు అవకాశం ఇవ్వడం లేదని పలువురు వాపోతున్నారు. ఇక అధికారులు కూడా విజిటింగ్ అవర్స్ పేరిట కాలయాపన చేస్తుండగా.. నిర్ణీత సమయంలో వెళ్లినా... సంబంధిత అధికారులు రిఫరెన్స్ ఇస్తే గానీ పెండింగ్ దరఖాస్తులపై చర్యలు తీసుకోలేకపోతున్నారు.

# కండ్లు మూసుకుంటాం.. పని కానిచ్చేయండి

**సెలవు దినాలు.. రాత్రి సమయాల్లో అక్రమ నిర్మాణాలు**

**ఫిర్యాదులు వచ్చినా.. అధికారుల కాలయాపన**

**ఆక్రమణదారులకు వంతపాడుతున్న 'ఎల్బీనగర్ టౌన్ ప్లానింగ్'**

*ఓ వైపు అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తామంటూ.. హైడ్రా క్షేత్రస్థాయిలో పనిలో నిమగ్నమవ్వగా.. ఎల్బీనగర్ టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటున్నది. 'కండ్లు మూసుకుంటాం...పని కానిచ్చేయండి' అన్నట్లు ఆక్రమణదారులకు వంతపాడుతున్నారు. ఫిర్యాదులు వస్తున్నా.. పట్టించుకోవడం లేదు. ఎల్బీనగర్ సర్కిల్ హస్తినాపురం డివిజన్ వెంకటేశ్వరకాలనీలోని జడ్పీ రోడ్ నం.3లో ఇంటి నంబర్ 8-7-98/84/బీ/ 22 ఉంది. దీని యజమాని కే. వేణుగోపాల్. ఈయన నివాసం పక్కనే ప్లాట్‌లో ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా ప్రహరీని ఆనుకొని పిల్లర్ నిర్మిస్తూ.. ప్రసన్న కుమార్ అనే వ్యక్తి ఇంటి నిర్మాణాన్ని చేపట్టాడు. వెంటనే సంబంధిత మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా.. చర్యలు తీసుకోలేదు కదా.. ఆ నిర్మాణానికి పరోక్షంగా సహకరించారు. ఇంకే ముంది.. అనుమతులు లేకుండానే సదరు వ్యక్తి రెండు, మూడో అంతస్తులనూ నిర్మిస్తున్నాడు.* *- ఎల్బీనగర్*

### తెల్లవారుజామున నిర్మాణం..

అక్రమ నిర్మాణంపై వేణుగోపాల్ ఎల్బీనగర్ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తి భవన నిర్మాణాన్ని ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో చేపట్టాడని, చుట్టు పక్కల ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంతో నిర్మాణ వ్యర్థాలు తన నివాసంలోనే పడి ఇబ్బందికరంగా మారిందని వేణుగోపాల్ పేర్కొన్నారు ఎల్బీనగర్ జోన్ ఏసీపీ శ్రీనివాస్ యాదవ్‌కు ఫిర్యాదు చేయగా, టౌన్‌ప్లానింగ్ అధికారులు తమ స్థలాన్ని పరిశీలించినా.. అక్రమ నిర్మాణం మాత్రం ఆగలేదన్నారు. నోటీసులు జారీ చేసి.. అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తామని చెప్పి రోజులు గడుస్తున్నా.. నోటీసులు ఇచ్చే విషయంలో మాత్రం తాత్సారం జరుగుతున్నదన్నారు. ఈ ఆలస్యాన్ని అనుకూలంగా మార్చుకుంటున్న సదరు నిర్మాణదారుడు మూడో అంతస్తును కూడా నిర్మించేందుకు ప్రణాళికలు చేస్తూ పిల్లర్లను నిర్మిస్తున్నట్లు వేణుగోపాల్ వాపోతున్నారు

### పుట్టగొడుగుల్లా అక్రమ నిర్మాణాలు..

అక్రమ నిర్మాణం జరిగితే వెంటనే ఫిర్యాదు చేస్తే యాక్షన్ తీసుకుంటామంటున్నారు అధికారులు. అయితే కండ్లముందే అక్రమ నిర్మాణం జరుగుతున్నా.. స్థానిక నాయకుల ఒత్తిడి మేరకు చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేస్తున్నారు. అక్రమ నిర్మాణం అని తెలిసినా.. అడ్డుకునేందుకు వెళ్లే అధికారులకు సదరు నిర్మాణదారులు ఎంతో కొంత ముట్టజెప్పుతున్నారన్న ఆరోపణలున్నాయి. మరోవైపు ఎల్బీనగర్ జోన్‌లోని హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్ సర్కిళ్ల పరిధిలో పుట్టగొడుగుల్లా అక్రమ కట్టడాలు వెలుస్తూనే ఉన్నాయి. వీటి తొలగింపు పేరుతో అమాయకుల నివాసాలపై తమ ప్రతాపం చూపుతున్న అధికారులు.. బడాబాబుల విషయానికి వచ్చే సరికి మిన్నకుండిపోతున్నారు.

# ఆనవాళ్లు లేకుండా..

## కబ్జా కోరల్లో మాసబ్ చెరువు

- రియల్టర్ల కన్ను చెరువుపై పడటంతో హారతి కర్పూరంలా కరిగిపోతున్న విస్తీర్ణం
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ప్లాట్లు చేసి విక్రయాలు
- ఫేక్ ఎన్‌వోసీలతో అనుమతులు పొంది యథేచ్ఛగా నిర్మాణాలు
- హైదరాబాద్-సాగర్ ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో అధిక ధర
- తటాకంలో కొనసాగుతున్న ఆక్రమణల పర్వం.. చోద్యం చూస్తున్న అధికారులు

*చెరువులు.. కుంటలు.. కబ్జాకు కావేవీ అనర్హం..అన్నట్లుగా సాగుతున్నది రంగారెడ్డి జిల్లాలో ఆక్రమణల పర్వం. కొందరు చెరపట్టి నీటి వనరులను మాయం చేస్తున్నారు. హైదరాబాద్-సాగర్ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న మాసబ్ చెరువు సైతం ఆక్రమణల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నది. రియల్టర్ల కన్ను ఈ చెరువుపై పడటంతో దీని విస్తీర్ణం క్రమక్రమంగా హారతి కర్పూరంలా కరిగిపోతున్నది. చెరువు పరి రక్షణ సమితి పేరిట స్థానికులు పోరాటం చేస్తున్నా..ఆక్రమణల తంతుకు మాత్రం అడ్డుకట్ట పడటం లేదు.* *- రంగారెడ్డి, సెప్టెంబర్ 14 (నమస్తే తెలంగాణ)*

తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి మాసబ్ చెరువు స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలతో చెరువు ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. మాసబ్ చెరువు 490 ఎకరాల్లో విస్తరించి ఉన్నది. ఇందులో కొంతమేర పట్టా భూములుండగా.. అవి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోనే ఉన్నాయి. భూముల ధరలు పెరగడంతో చాలామంది రైతులు తమ భూములను అమ్ముకున్నారు. ఇదే అదనుగా రియల్టర్ల కన్ను ఈ చెరువుపై పడింది. ఇష్టానుసారంగా వెంచర్లు చేసి ప్లాట్లను విక్రయించారు. చెరువు చుట్టూ ఉన్న తుర్కయాంజాల్, ఇంజాపూర్, గుర్రంగూడ, ఆదిత్యనగర్, ఏవీనగర్ వాసులు ప్లాట్లను కొనుగోలు చేసి చెరువు ప్రాంతాన్ని మట్టి పోసి పూడ్చివేస్తున్నారు. ఈ క్రమంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోనూ పెద్ద పెద్ద భవనాలు వెలిశాయి. ఒకప్పుడు మాసబ్ చెరువు 30 గ్రామాలకు సాగునీటిని అందించేందని స్థానికులు చెబుతున్నారు.

### పట్టించుకోని అధికార యంత్రాంగం..

మాసబ్ చెరువును ఆక్రమణల చెర నుంచి విముక్తి కల్పించాలని ఈ ప్రాంతవాసులు ఫిర్యాదులు చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో సర్వేనం. 205లో సుమారు 5 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు కొందరు యత్నించారు. 60 ఫీట్ల మేర రోడ్డునూ నిర్మించారు. స్థానికులు అడ్డుకోవడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పి.. అధికారులు చేతులు దులుపుకొన్నారు. ఆ తర్వాత కూడా చెరువు భూముల్లో ఆక్రమణలు కొనసాగుతున్నా..నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫేక్ ఎన్‌వోసీలతో అక్రమంగా అనుమతులు పొంది నిర్మాణాలు చేపడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నా..అధికారులు చర్యలు తీసుకున్న సందర్భాలు లేవు.

### చెరువు పరిసరాలు కంపు..కంపు..

గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాసబ్ చెరువును ఆధునీకరించేందుకు చర్యలు చేపట్టింది. రూ. 2 కోట్లతో హెచ్ఎండీఏ అధికారులు సుందరీకరించి.. అన్ని రకాలుగా అభివృద్ధి చేశారు. చెరువుకట్టపై పూల మొక్కలను ఏర్పాటు చేసి అందంగా తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్‌నూ ఏర్పాటు చేశారు. దీంతో చెరువు అందాలను ఆస్వాదించేందుకు పిల్లలు మొదలుకుని వృద్ధుల వరకు అందరూ సందర్శిస్తున్నారు. అయితే చెరువు ఎగువన ఉన్న బడంగ్‌పేటతో పాటు ఇతర ఆవాసాల నుంచి వచ్చే మురుగు నీరంతా చెరువులోకే వెళ్తుండటంతో నీరంతా దుర్గంధంగా మారుతున్నది. పరిసరాలు కంపు కొడుతుండటంతో చెరువు సందర్శనకు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. స్వచ్ఛతకు మారుపేరుగా ఉన్న చెరువు నేడు దుర్గంధంగా మారడం.. స్థానికులను సైతం కలిచి వేస్తున్నది.

### 'హైడ్రా' కొరడా ఝుళిపించేనా..

ప్రస్తుతం హైదరాబాద్‌లో హైడ్రా చెరువుల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్నది. ఈ నేపథ్యంలో ఎఫ్‌టీఎల్ పరిధిలో వెంచర్లు చేసిన వ్యాపారులతో పాటు ప్లాట్లు కొని నిర్మాణాలు చేపట్టిన వారి గుండెల్లోనూ గుబులు మొదలైంది. ఇదే తరహాలో మాసబ్ చెరువుపై హైడ్రా దృష్టి సారించి.. చెరువుకు సంబంధించిన భూముల్లో ఆక్రమణలను గుర్తించి, అక్రమార్కులపై కొరడా ఝుళిపించాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే స్థానికుల నుంచి పెద్ద ఎత్తున హైడ్రాకు ఫిర్యాదులు అందినట్లు సమాచారం.